సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 31 । జనవరి । 2023



సోమశిలలో 69.316 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 69.316 టీఎంసీలు ఉన్నాయి. 1,571 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 650, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,090
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,278
3 శాతం జీఎస్టీతో	రూ.5,436
నవర (8 గ్రా)	రూ.43,488

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.5 /24.4

బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ 75 శాతం ఉంది.

అబద్ధాల వ్రతం

సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని సోమిరెడ్డి అవినీతిగా ప్రచారం చేస్తున్నారు. కళ్ల ముందు అభివృద్ధి పనులు, ఖర్చుల గణాంకాలు పారదర్శకంగా కనిపిస్తున్నా అనునిత్యం అబద్ధాల వ్రతంతో తన రాజకీయ పునాదులు నిర్మించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. 'దున్నపోతు ఈనిందంటే.. దూడను గాటన కట్టేయండి' అనే చందాన సోమిరెడ్డి తిక్క లెక్కలను పచ్చ మీడియా పతాక శీర్షికలతో ప్రచురిస్తోంది.

రూ.43 కోట్ల పనుల్లో రూ.30 కోట్ల అవినీతి జరిగిందా!

- సర్వేపల్లిలో అభివృద్ధిని ఓర్వలేక బుర్ర తక్కువ ప్రచారం
- జనం నవ్వుతారన్న సిగ్గూఎగ్గూ లేకుండా విమర్శలు
- పచ్చమీడియాలో దుష్ప్రచారంతో పబ్బం



ఇరువూరులో వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన సూపర్ పాసేజ్

సాక్షి, ప్రతినిధి, నెల్లూరు: టీడీపీకి చెందిన మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాజకీయంగా పాతాళానికి పడిపోయాడు. సర్వేపల్లి నియోజకవర్గంలో దశాబ్దాలుగా అబద్ధాలు, మోసాలు, విభజించి పాలించే రాజకీయాలు చేసి పబ్బం గడుపుకున్నాడు. జనం చైతన్యవంతులు కావడంతో నిజాయితీతో కూడిన రాజకీయాలకు నియోజకవర్గ ప్రజలు జైకొడుతున్నారు. ఈ దరిమిలా గడిచిన ఐదు దఫాలుగా వరుసగా ఓటమిపాలయ్యాడు. దీంతో వచ్చే సార్వత్రిక ఎన్నికలకు టికెట్ వస్తుందో రాదో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న సోమిరెడ్డి పచ్చమీడియాలో పతాక శీర్షికల్లో కనిపించేందుకు బుర్రతక్కువ ప్రచారం చేస్తున్నాడు. అనునిత్యం అబద్ధాలు వల్లెవేస్తూ ప్రజాగ్రహానికి గురవుతున్నాడు. ఇప్పటికే పలుమార్లు ప్రజాక్షేత్రంలో భంగపడిన సోమిరెడ్డి తాజాగా సర్వేపల్లి నియోజకవర్గంలో కనుపూరు కాలువ పూడిక తీత పనుల్లో భారీగా అవినీతి జరిగిందంటూ చేసిన ఆరోపణలపై స్థానికులు భగ్గుమంటున్నారు. రూ.43 కోట్ల పనుల్లో రూ.30 అవినీతి జరిగిందంటూ సోమిరెడ్డి చేస్తున్న రాజకీయ విన్యాసాలు చూసి అందరూ ముక్కున వేలుసుకుంటున్నారు.

వాస్తవాలు ఇవీ..

- కనుపూరు కెనాల్‌లో 2019–20 నుంచి 2021–22 వరకు ఇప్పటికి ఓఅండ్ఎం, ఎఫ్‌డీఆర్ పథకాల ద్వారా మూడేళ్ల కాలంలో 297 పనులకు రూ.43,91,70,000 నిధులు మంజూరయ్యాయి. అందులో 103 పనులకు రూ.13,81,63,000 మాత్రమే బిల్లులు విడుదల చేశారు. ఇంకా 194 పనులకు సంబంధించి రూ.30,08,90,000 బిల్లులు చెల్లించాల్సి ఉంది.
- కనుపూరు కెనాల్‌లో ఎక్కడా తాత్కాలిక పనులు చేపట్టలేదు. ఆయా నిధులతో అన్ని శాశ్వత పనులే చేపట్టారు. కాజ్‌వేలు, కల్వర్టులు, పూడికతీత పనులు జరిగాయి. పూర్తి చేసుకున్న కాజ్‌వే, కల్వర్టులు కళ్లముందు కనిపిస్తుంటే రూ.30 కోట్ల అవినీతి జరిగిందంటూ సోమిరెడ్డి ప్రచారం చేయడాన్ని సొంత పార్టీ నేతలే అసహ్యించుకుంటున్నారు. ఇయన తీరుతో జనంలో తలెత్తుకుని తిరగలేకపోతున్నామని తలలు పట్టుకుంటున్నారు.
- పెన్నానదికి గతేడాది వచ్చిన వరదలు విధ్వంసం సృష్టించడంతో కనుపూరు కాలువ కట్టలు తెగిపోయాయి. ఫలితంగా విరువూరు, మహ్మదాపురం, సూరాయపాళెం, గ్రామాల్లో వరిసాగుకు ఇబ్బంది జరగడంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పంట సాగుకు ఇబ్బంది లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న కాలువలు, మట్టికట్టలకు మరమ్మతుల కోసం రూ.1.06 కోట్లు మంజూరు చేయించి పనులు వేగవంతంగా చేయించారు. ఫలితంగా 1,200 ఎకరాల్లో పంటలు సజావుగా సాగు జరుగుతోంది. ఇరువూరులో సాగునీటి అవసరాల దృష్ట్యా ఇరిగేషన్ అధికారులతో సూపర్ పాసేజ్ పనులకు అంచనాలు వేయించి పనులు యుద్ధప్రాతిపదికన చేయించారు.

సోమిరెడ్డికి ప్రతిది రాజకీయమే



కనువూరు కాలువను పరిశీలించేందుకు వచ్చిన సోమిరెడ్డి అనవసర రాద్ధాంతం చేసి వెళ్లాడు. గతేడాది పెన్నా వరదలకు రైతులు నష్టపోతే రాని సోమిరెడ్డి ఇప్పుడు రాజకీయం చేస్తున్నాడు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రైతుల కోసం ధ్వంసం అయిన సూపర్ ఫాసేజ్‌ను యుద్ధప్రాతిపదికన నిర్మించి రైతులను ఆదుకున్నారు.

– చిన్నిరెడ్డి వెంకురెడ్డి, విరువూరు గ్రామ రైతు

సోమిరెడ్డి తీరు సిగ్గుచేటు



గతేడాది పెన్నానది వరదల్లో ఫాసేజ్ కొట్టుకుపోతే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తాత్కాలికంగా పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేయించి విరువూరులో పంటలు పండేలా చేశారు. సోమిరెడ్డి వచ్చి అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ఆరోపించడం సిగ్గు చేటు . రాజకీయాలు మాని అభివృద్ధికి సహకరిస్తే మంచిది. తప్పుడు సమాచారంతో వచ్చి మాట్లాడడం వల్ల ఆయన మరింత దిగజారి పోతారు.

– బత్తలపల్లి శ్రీనివాసులు, విరువూరు రైతు

పేదల సంక్షేమానికి చేదోడు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- జిల్లాలో 18,522 మంది లబ్ధిదారులకు రూ.18.52 కోట్ల సాయం

నెల్లూరు (అర్బన్): రాష్ట్రంలోని ఆయా వర్గాల పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా వినుకొండలో మూడో విడత జగనన్న చేదోడు పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేల వంతున సీఎం బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నుంచి నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కలెక్టర్ చక్రధర్‌బాబు ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నాయీ బ్రాహ్మణ, రజక, టైలర్లకు సంబంధించి చేతి వృత్తులపై ఆధారపడిన పేదలు తమ వృత్తిని మరింతగా విస్తరించుకునేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారన్నారు. అందులో భాగంగా మూడో విడతల్లో జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో రూ.51 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా అందకపోతే మళ్లీ మరోమారు పరిశీలించి వారికి కూడా నగదును అందించే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. కలెక్టర్ చక్రధర్ బాబు మాట్లాడుతూ చేతివృత్తులదారులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోకుండా ఉండేందుకు ప్రభుత్వం నగదు సాయం చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 18,522 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.18.522 కోట్ల మెగా నమూనా చెక్కును మంత్రి, కలెక్టర్ లబ్ధిదారులకు అందించారు.



జగనన్న చేదోడు ద్వారా లబ్ధిదారులకు మెగా నమూనా చెక్కును అందించిన మంత్రి కాకాణి, కలెక్టర్ చక్రధర్‌బాబు తదితరులు

మహాత్మాగాంధీజీకి నివాళి

మహాత్మాగాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు, అధికారులు గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మానందరెడ్డి, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్‌సింగ్, జగనన్న చేదోడు లబ్ధిదారులు పాల్గొన్నారు.

కులవృత్తికి అండగా ప్రభుత్వం



కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మాలాంటి పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుంటోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేదోడు పథకం కింద సంవత్సరానికి రూ.10 వేలు చొప్పున అందిస్తున్నారు. ఈ డబ్బును నా వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటాను. మా కుటుంబానికి విద్యాదీవెన పథకం కింద ఆర్థిక సాయం అందింది. ఇంటి స్థలం పట్టా సైతం మంజూరు చేశారు.

– అన్నమేటి మల్లికార్జున, ఎన్‌టీఆర్‌నగర్, బార్బర్ షాపు

సోమిరెడ్డీ.. చర్చకు సిద్ధమా?

- బండేపల్లి, డేగపూడి కాలువల అభివృద్ధి మా హయాంలోనే..
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): 'సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.. గత ప్రభుత్వ హయాంలో నువ్వు అవినీతికి పాల్పడ్డావు. దీనిపై చర్చకు సిద్ధమా?. నువ్వు చెప్పేవన్నీ అబద్ధాలే.. నీ గురించి సర్వేపల్లి నియోజకవర్గవాసులకు బాగా తెలుసు కాబట్టే ఎన్నికల్లో ఓడిస్తున్నారు.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని మాగుంటలేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కొద్దిరోజులుగా తనపై, వైఎస్సార్‌సీపీపై కొంతమంది పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అవినీతికి పాల్పడ్డారని పదేపదే చెబుతుంటే నిజమైపోతుందనే టీడీపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని బండేపల్లి, డేగపూడి కాలువలకు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రహణం పట్టుకుందన్నారు. అప్పట్లో రూ.26 కోట్లతో పనులను టెండర్ లేకుండానే నామినేషన్ వర్క్‌తో కొట్టేయాలని ప్రయత్నం చేశారన్నారు. బండేపల్లి కాలువ పనులకు సంబంధించి భూసేకరణకు ఒక్కరూపాయి అయినా విడుదల చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బండేపల్లి, డేగపూడి కాలువల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఆ ప్రాంత రైతులు తమకు భూసేకరణ డబ్బులు రాలేదని చెబితే తమ ప్రభుత్వ హయాంలో రూ.4 కోట్లు విడుదల చేశామన్నారు. నాన్‌ఫిషర్‌మెన్ ప్యాకేజీ కింద అప్పట్లో రూ.14 కోట్లు ఇచ్చామని సోమిరెడ్డి చెబుతున్నాడని, వాస్తవానికి రూ.9 కోట్లు ఇచ్చామని అధికారులు చెబుతున్నారని, మిగిలిన రూ.5 కోట్లు ఏమయ్యాయని మంత్రి ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నీరు–చెట్టు కింద కనుపూరుకాలువలో జరిగిన అవినీతిని వాస్తవాలతో బయటపెట్టామన్నారు. ఇలా చెబుతూపోతే టీడీపీ హయాంలోనే అవినీతి జరిగిందని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. 'నీ అవినీతిపై ప్రమాణం చేయడానికి నేను సిద్ధం.. నీవు సిద్ధమా' అని సోమిరెడ్డికి సవాల్ విసిరారు. ధైర్యం, నీతి, నిజాయితీ ఉంటే దేవుడి వద్దకు వచ్చి ఆరోపణలకు ఆధారాలు చూపించాలన్నారు. టీడీపీది అవినీతి పాలన వైఎస్సార్‌సీపీది సంక్షేమపాలన అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలంతా గుర్తించారన్నారు.

పెన్నాతీరం.. ప్రకృతి సౌందర్య హారం

ఆత్మకూరురూరల్: జీవ జలాలకు పుట్టినిల్లు పెన్నాతీర ప్రాంత గ్రామాలు.. అవి ప్రకృతి సౌందర్య హారాలుగా అలరారుతున్నాయి. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం, కనుపూరుపల్లి, బండారుపల్లి గ్రామాలు కోనసీమను తలపిస్తుంటాయని స్థానికులు ఆనందంగా చెబుతుంటారు. ఆత్మకూరు– చేజర్ల మండలాల మధ్యలో సువిశాల విస్తీర్ణంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన పెన్నానది గట్టున ఈ గ్రామాలున్నాయి. వీటిలో అప్పారావుపాళెంలో మండువేసవిలో సైతం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. గ్రామంలో బోర్ల కింద ఏడాది పొడవునా పైర్ల సాగుబడి జరుగుతూనే ఉంటుంది. ప్రతి రైతు కుటుంబం పాడిపంటలతో తులతూగుతుంటుంది. సుమారు 1,000 ఎకరాల మామిడి తోటలు, 1,500 ఎకరాల వరిసాగు భూములు ఈ గ్రామానికి పచ్చని కోక వలే నిత్యనూతనమై చూపరులను పరవశింపజేస్తుంటాయి.


కనువిందు చేస్తున్న వరి పైరు, కొబ్బరి చెట్లు, మామిడి తోటలు


ఏపుగా పెరిగిన చెట్ల నడుమ అప్పారావుపాళెం ప్రధాన రహదారి


అప్పారావుపాళెంలో పైరుకు సమృద్ధిగా అందుతున్న నీరు


మామిడితోట చుట్టూ సాగు చేస్తున్న అరటి చెట్లు

కోనసీమగా చెప్పొచ్చు



పచ్చని పొలాలతో, రోడ్లకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల స్వచ్ఛమైన గాలులతో పెన్నానది ఒడ్డున ఉన్న అప్పా రావుపాళెనికి నెల్లూరు జిల్లాలో మరో కోనసీమగా చెప్పొచ్చు. మామిడి, అరటి, రామాఫలం పండ్ల రకాలతోపాటు, కొబ్బరి తోటలు విస్తారంగా మా గ్రామంలో ఉన్నాయి.

– చంద్రా హజరత్‌నాయుడు

ఏడాది మొత్తం సాగు



పెన్నానది పారివాహక గ్రామాల్లో వరి అధికంగా సాగులో ఉంది. ఏడాది మొత్తం పైర్లు పండడం గ్రామస్తుల అదృష్టం. ఉష్ణోగ్రతలు ఎంత పెరిగినా ఆ ప్రభావం కనిపించదు. గతంలో సోమశిల మునక గ్రామాల నుంచి వచ్చిన కుటుంబాల వారు ఎకరా రూ.12 వేలు చొప్పున భూములు కొని సాగుచేసుకుంటున్నారు.

– గడ్డం శ్రీనివాసులురెడ్డి

'గంజాయి' మూలాలపై సెబ్ గురి

- అధికారుల అదుపులో ఇద్దరు సరఫరాదారులు
- విశాఖ నుంచి నెల్లూరుకు తరలింపు

నెల్లూరు(క్రైమ్): సెబ్ అధికారులు గంజాయి విక్రయాలపై దాడులు చేయడం.. నిందితుల అరెస్ట్‌తోనే సరిపెట్టుకోకుండా మూలాల ఏరివేత దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా విశాఖ ఏజెన్సీ నుంచి గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సెబ్ ప్రత్యేక బృందం విశాఖపట్నంలో అదుపులోకి తీసుకుని సోమవారం తెల్లవారుజామున నెల్లూరుకు తీసుకొచ్చింది. వారిని విభిన్న కోణాల్లో విచారిస్తున్నారు. అధికారుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలో విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగిస్తున్న ఓ ముఠా కదలికలపై జిల్లా సెబ్ అధికారిణి కె.శ్రీలక్ష్మి నేతృత్వంలో ప్రత్యేక బృందం నిఘా ఉంచింది. 2021 జూలై 30వ తేదీన ముఠాలోని హోల్‌సేల్ విక్రయదారుడు నెల్లూరు నగరానికి చెందిన ఎ.జోసఫ్, విక్రయదారులు వెంకటసాయికుమార్, సీహెచ్ వెంకటేశ్వర్లు, షేక్ సుభానీ, ఆర్.పవన్‌కళ్యాణ్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10.50 లక్షల విలువచేసే 157 కేజీల గంజాయి, రూ.40 వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఎం.శ్రీను వద్ద కేజీ గంజాయి రూ.4,500 చొప్పున కొనుగోలు చేసి నెల్లూరులో 50 గ్రాముల ప్యాకెట్లను చేసి విద్యార్థులకు ఒక్కొక్కటి రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ప్రత్యేక బృందం వారిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. సరఫరాదారుడి పేరు, అనకాపల్లి అనే విషయం మాత్రమే చెప్పడంతో దర్యాప్తు తలకుమించిన భారంగా మారింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందం గాలించింది. ఈక్రమంలో అతను అనకాపల్లి జిల్లా పెద్దమదిన్నె ప్రాంతవాసిగా గుర్తించారు. ఆదివారం సెబ్ నెల్లూరు–1 ఇన్‌స్పెక్టర్ కేపీ కిశోర్, ఎస్సై బాలకృష్ణ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం విశాఖలో ఎం.శ్రీనుని అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తరలించారు.

టెంట్ హౌస్ నిర్వహిస్తూ..

ఏజెన్సీ నుంచి గంజాయి సరఫరా చేస్తున్న మరో నిందితుడిని సైతం సెబ్ ప్రత్యేక బృందం విశాఖలో అదుపులోకి తీసుకుంది. వారి కథనం మేరకు.. ఈనెల 16వ తేదీన నెల్లూరు రైల్వేస్టేషన్ వద్ద సెబ్ ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్‌లు హుస్సేన్‌బాషా, కేపీ కిశోర్ తమ సిబ్బందితో కలిసి నిఘా ఉంచారు. హౌరా మెయిల్‌లో చెన్నైకి గంజాయిని సరఫరా చేస్తున్న అనంతపురానికి చెందిన ఆర్.నేతాజీని అదుపులోకి తీసుకున్నారు. అతడిచ్చిన సమాచారం మేరకు అదే రైల్లో ప్రయాణిస్తున్న పి.నాగేశ్వరరావు, జి.కుమారి, వి.చిన్నారిని పట్టుకుని పది కేజీల గంజాయి, కేజీ లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారు తడ వద్ద చెన్నైకు చెందిన రాజేష్‌కు అప్పగించేందుకు తీసుకెళ్తున్నామని చెప్పగా అతడిని సైతం అరెస్ట్ చేసి కారులో ఉన్న కేజీ గంజాయిని సీజ్ చేశారు. అనంతరం నిందితులను విచారించగా పాడేరు లగిసేపల్లి ప్రాంతానికి చెందిన ఎల్.సునీల్‌కుమార్ గంజాయి సరఫరా చేశాడని వెల్లడించారు. దీంతో ప్రత్యేక బృందం విశాఖపట్నంలో అతడిని సైతం అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తీసుకొచ్చారు. నిందితుడు స్థానికంగా టెంట్ హౌస్ నిర్వహిస్తూ ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇద్దరి నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు అధికారులు లోతుగా విచారిస్తున్నారు.

తల్లి మందలించిందని..

- కొడుకు బలవన్మరణం

బుచ్చిరెడ్డిపాళెం: తల్లి మందలించిందని కొడుకు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దామరమడుగు పంచాయతీ పరిధిలోని ఆర్‌ఆర్ నగర్‌లో జరిగింది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. ఆర్‌ఆర్ నగర్‌కు చెందిన రత్నమ్మకి ఆత్మకూరు నరసయ్య (21) అనే కుమారుడు ఉన్నాడు. ఇద్దరూ కూలి పనులకు వెళ్తుంటారు. కాగా వచ్చే డబ్బుతో నరసయ్య నిత్యం మద్యం తాగేవాడు. ఆదివారం రాత్రి కొడుకు మద్యం తాగి రావడంతో తల్లి మందలించింది. కాసేపటి తర్వాత అతను పురుగుమందు తాగాడు. గుర్తించిన రత్నమ్మ స్థానికుల సహకారంతో అతడిని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోప్ స్కిప్పింగ్ పోటీల విజేత తూర్పుగోదావరి

- జాతీయస్థాయి పోటీలకు నెల్లూరు వాసులు

సాక్షి, భీమవరం: భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, పశ్చిమ, గుంటూరు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బేగారి జాన్సన్ చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో బ్రౌనింగ్ జూనియర్ కాలేజ్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీస్ సెల్ రాష్ట్ర చైర్మన్ మేడిది జాన్సన్, కరస్పాండెంట్ మేడిది ఎస్తేరు ప్రియాంక ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు మెడల్స్ అందజేశారు. అండర్–17 బాలుర విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జట్టులో నెల్లూరు జిల్లాకు చెందిన డి.దీపిక, పి.స్వాతి ఉన్నారు.

కోర్టు ఆవరణలో బాంబు పేలుడు కేసు కొట్టివేత

నెల్లూరు(లీగల్): నెల్లూరులో మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదురుగా కాంపౌండ్ దగ్గర ప్రెషర్ కుక్కర్ బాంబు పేలుడుకి సంబంధించి నిందితులపై నమోదైన కేసును కొట్టివేస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కేపీ బాలాజీ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2016 సెప్టెంబర్ 12వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కోర్టు కాంపౌండ్ వద్ద పేలుడు వచ్చింది. దీంతో అక్కడ ఉన్న తురకా సూరిబాబు అనే వ్యక్తి నెల్లూరు 4వ పట్టణ పోలీసులకు సమాచారం అందజేశారు. నెల్లూరు నగర డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేశారు. అనంతరం ఎన్ఐఏ దర్యాప్తులో భాగంగా గతంలో చిత్తూరు, కేరళ, మైసూరు తదితర ప్రాంతాల్లోని కోర్టు ప్రాంగణాల్లో ఇదే తరహాలో బాంబు పేలుళ్లు జరిగినట్లు గుర్తించారు.

ఈ కేసులో అబ్బాస్‌అలీ, దావుద్ సులేమాన్, శ్యాంసన్ కరీంరాజా, మహ్మద్ అయూబ్, షంషుద్దీన్ అనే వారిని అరెస్ట్ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును కొట్టేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 228
లేయర్ చికెన్	: 136

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.35
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.8

ముగిసిన అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీలు

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడురోజులపాటు రాష్ట్ర అండర్–17 హ్యాండ్‌బాల్ పోటీలు జరిగాయి. 13 జిల్లాలకు చెందిన 26 బాలబాలికల టీంలు పాల్గొన్నాయి. రెండోరోజు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన జట్లకు సోమవారం పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో విశాఖపట్నం, బాలికల విభా గంలో ప్రకాశం జట్లు విజేతలుగా నిలిచాయి. బాలుర విభాగంలో నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలు, బాలికల విభాగంలో విజయనగరం, వెస్ట్ గోదావరి జట్లు రన్నర్స్‌గా నిలిచాయి.

వారికి దాత వాకా వెంకటేశ్వర రెడ్డి సమకూర్చిన బహుమతులను ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, ఎస్సై ఎం.సైదుబాబు అందజేశారు. పూర్వ విద్యార్థి సీహెచ్ పాపయ్య విజేతలైన రెండు జట్లకు రూ.5 వేల చొప్పున ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ ఇందిర రాణి, వైస్ చైర్మన్ సుధీర్, వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


పెంచలయ్య మృతదేహం

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. సంగం సీఐ రవినాయక్ కథనం మేరకు.. మండలంలోని జమ్మవరం గ్రామానికి చెందిన ఐతా పెంచలయ్య (50)కు భార్య వెంకటరమణమ్మ, నలుగురు పిల్లలున్నారు. ఆదివారం అతను కొంగల వేట కోసం చిరమన చెరువు సమీపానికి వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు జారి చెరువులో పడి మునిగిపోయాడు. భర్త ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య సోమవారం ఉదయం పోలీసులను ఆశ్రయించింది. ఏఎస్‌పేట ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి వెతకగా చెరువులో పెంచలయ్య మృతదేహం కనిపించింది. స్థానికుల సాయంతో దానిని బయటకు తీశారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో భార్య, పిల్లల కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో సెమిస్టర్‌కు 81 మంది విద్యార్థులకు గానూ 75 మంది, మధ్యాహ్నం జరిగిన మూడో సెమిస్టర్‌కు 8,863 మందికి గానూ 8,008 మంది హాజరైనట్లు వెల్లడించారు. నెల్లూరులోని సర్వోదయ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు, జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని డిబార్ చేశారన్నారు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

కావలి రూరల్: గూడ్స్ రైలు కింద పడి పి.వంశీకృష్ణ (22) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం కావలి రైల్వేస్టేషన్‌లో జరిగింది. రైల్వే ఎస్సై అరుణకుమారి కథనం మేరకు.. దగదర్తి మండలం బాడుగులపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ పనులు చేసే పందిళ్లపల్లి శ్రీనివాసరావు, కృష్ణమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులున్నారు. పెద్ద కొడుకు వంశీకృష్ణ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. చిన్న కుమారుడు పనులకు వెళ్తుంటాడు. వంశీకృష్ణ ఇంజినీరింగ్ సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు కావలికి వెళ్తున్నానని సోమవారం ఉదయం ఇంట్లో చెప్పి వచ్చాడు. సాయంత్రం రైల్వేస్టేషన్‌లో మూడో లైన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.